క్లుప్తంగా

సంపు సమస్యను పరిష్కరిస్తాం



ఎల్.గన్నవరంలో ఒరిగిపోయిన మంచినీటి సంపును పరిశీలిస్తున్న ఈఈ రమేష్‌బాబు

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో నిర్మించిన మంచినీటి సంపు 2022లో వచ్చిన వరదలకు రెండు అడుగుల మేర భూమి నుంచి పైకి లేచి, ఒక పక్కకు ఒరిగిపోయింది. అప్పటి నుంచి ట్యాంకులోకి నింపిన తాగు నీరు నిల్వ ఉండకుంగా లీకేజీ అవుతోందని ఇటీవల గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎం.రమేష్‌బాబు మంగళవారం సంపును పరిశీలించారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అంబాజీపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మాచవరంలో ఇంటింటా ఫీవర్ సర్వేను మంగళవారం నిర్వహించారు. రెండు రోజులు కంటే జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్య సేవలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం జ్వరపీడతుల వివరాలను సేకరిస్తున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వి.మురళీకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పి.గన్నవరం: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పి.గన్నవరంలో మంగవారం నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకూ ర్యాలీ జరిగింది. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన కల్పించుకోవాలని పి.గన్నవరం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి ప్రభాకర్, ఎంపీహెచ్‌ఈఓ రెడ్డి, హెచ్‌వీ శాంతకుమారి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కె.ఏనుగుపల్లిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, బీజేపీ నాయకుడు నల్లా

పి.గన్నవరం: బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం మండలంలోని కె.ఏనుగుపల్లిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



ఎం.అశోక్

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల ఏడున ప్రారంభమయ్యే గణపతి నవరాత్ర మహోత్సవాలకు అనుమతులు తప్పనిసరని ఎం.అశోక్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది సింగిల్ విండో విధానంలో అనుమతులను మంజూరు చేస్తున్నామన్నారు. వినాయక చవితి పందిళ్ల ఏర్పాటు కోసం వినాయక ఉత్సవ కమిటీలు సమీప పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. గణపతి నవరాత్రుల్లో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అయినవిల్లి: యువత మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని అయినవిల్లి ఎస్సై కె.మనోహర్‌జోషి అన్నారు. మంగళవారం ముక్తేశ్వరం ఎస్ఎన్‌వీఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మనోహర్‌జోషి మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. అలాగే అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఒక్కసారి చట్టం దృష్టిలో నేరస్తులుగా పరిగణిస్తే వారి భవిష్యత్ నాశనమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సామ్‌ఏబెల్ తదితరులు ఉన్నారు.

పేముల కాల్వకు మోక్షమెప్పుడో?

- ముందుకు సాగని మురుగునీరు
- పలు చోట్ల ఆక్రమణలు
- పేరుకుపోయిన గుర్రపుడెక్క



ఆక్రమణలు, గుర్రపుడెక్కతో బక్కచిక్కిన పేముల కాల్వ డ్రైన్

మలికిపురం: పలు గ్రామాల్లో ముంపు, మురుగునీరు పారుదలకు ప్రధానమైన పేముల కాల్వ డ్రైన్‌లో మురుగునీరు ముందుకు సాగడం లేదు. ఈ డ్రైన్ పరిధిలోని శివకోడు, దిండి, రామరాజులంక, రాజోలు, మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక, మట్టపర్రు గ్రామాల్లోని పంట పొలాలు, నివాస ప్రాంతాల మురుగునీరు వెళ్లే మార్గం లేక ఈ గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30 ఏళ్ల నుంచి డ్రైన్ పూడుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్వల్పంగా మరమ్మతులు చేశారు. అయితే పూర్తిగా ఆక్రమణలకు గురికావడం డ్రైన్ మరమ్మతులకు ఆటంకంగా మారింది. శివకోడు బంగ్లా వద్ద నుంచి ప్రారంభమైన ఈ డ్రైన్ శివకోడుపాలెం, దిండి, మేడిచర్లపాలెం గుడిమెళ్లంక, విశ్వేశ్వరాయపురం గ్రామం మీదుగా వేపచెట్టు డ్రైన్‌లో కలుస్తుంది. శివకోడు–దిండి సరిహద్దులోని కట్టా వారి గ్రూపు నుంచి ప్రారంభమైన మరో డ్రైన్ కూడా వచ్చి దిండిలోనే రామరాజులంక డ్రైన్‌లో కలుస్తుంది. ఈ డ్రైన్లు మురుగునీటితో పాటు పేముల కాలువ మురుగునీటి ఏకమై ముందుకు సాగక ఈ గ్రామాల్లో పంట పొలాలు, నివాస ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి సుమారు ఆరు కిలోమీటర్లు పొడవు ఉండే ఈ డ్రైన్ చివరి భాగం నుంచి సుమారు రెండు కిలో మీటర్లు వరకూ 100 లింకులు వెడల్పు ఉంటుందని స్థానిక రైతులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఇక్కడ 20 లింకుల వెడల్పు మాత్రమే ఉందని మిగిలిన భాగం ఆక్రమణలకు గురైందని వారు పేర్కొన్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం జరిగిన తాత్కాలిక మరమ్మతుల సమయంలో డ్రైన్ బాగానే ఉందని రానురానూ డ్రైను కుచించుకుపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ డ్రైన్ వెంబడి ఆక్రమణల్లో కొబ్బరితోటలు అధికంగా ఉన్నాయి. వీటిని తొలగించడం కుదరదని రైతులు స్పష్టం చేయడంతో పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయి. సుమారు నాలుగు వేల కొబ్బరిచెట్లు తొలగించాల్సి ఉన్నట్లు సమాచారం. అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోలేదు. ఫలితంగా రామరాజులంక, దిండి, మేడిచర్లపాలెం, శివకోడు, గుడిమెళ్లంక గ్రామాల్లోని ఆయకట్టుకు ఇబ్బందులు తొలగలేదు. ఈ గ్రామాల్లోని ఆయకట్టు ప్రమాదంలో చిక్కుకుంది. ఇప్పటికే ఆక్రమణలు, గుర్రపుడెక్కతో బక్కచిక్కిన పేముల కాల్వ డ్రైన్‌ను మరమ్మతులు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తి ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో డ్రైన్ల తాత్కాలిక మరమ్మతులు చేసి సార్వాకు ఇబ్బందులు లేకుండా చేసేది. ప్రస్తుత ప్రభుత్వం అదేమీ చేయలేదు. ఇదే కొనసాగితే భవిష్యత్‌లో శివకోడు, దిండి, మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక గ్రామాల నుంచి వచ్చే మురుగునీటి పారుదల ప్రశ్నార్థకంగా మారుతుంది. ఈ డ్రైన్ పరిధిలో సుమారు మూడువేల ఎకరాల వరి సాగుతో పాటు, సుమారు 2 వేల నివాస ప్రాంతాలు ఉన్నాయి. ఇక వర్షాకాలంలో కొబ్బరి తోటల నుంచి ముంపు నీరు దిగేందుకు కొబ్బరి తోటలకు కూడా ఈ డ్రైన్ చాలా అవసరం.

మరమ్మతులు చేయండి



పేముల కాల్వ డ్రైన్ అస్తవ్యస్తంగా ఉంది. కనీస మరమ్మతులు లేవు. వర్షం నీరు ముంపు దిగే పరిస్థితి లేదు. ఫలితంగా ఈ డ్రైన్ పరిధిలో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది.

– నల్లి అంజలీదేవి ఎంపీటీసీ, గుడిమెళ్లంక–మట్టపర్రు

ఆక్రమణలు తొలగిస్తాం



పేముల కాల్వ డ్రైన్ సమస్య తమ వద్ద ఉంది. దీనిపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం ప్రతిపాదనలు రూపొందించాం. గుర్రపుడెక్క కూడా తొలగిస్తాం.

– భూపతి రేష్మారాణి, డ్రైన్స్ జేఈ, మలికిపురం

జీవన నాణ్యతను మెరుగుపరుచుకోవాలి



వక్కలంక కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరోవర్

అంబాజీపేట: పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్) గ్రూప్ సభ్యులైన చెంచులు వారి జీవన నాణ్యతను, శ్రేయస్సును మెరుగుపర్చుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారం, వక్కలంక గ్రామాల్లో సర్పంచ్‌లో దొంగ నాగేశ్వరరావు, వాసంశెట్టి రేవతిల అధ్యతన పీఎం ఏడబ్ల్యూఏఎస్ (ప్రధాన మంత్రి జనజాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ సరోవర్ మాట్లాడుతూ పీవీటీజీ గ్రూపు సభ్యులైన వారికి ప్రధాన మంత్రి జనజాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం ద్వారా 11 రకాల సౌకర్యాలు కల్పించనున్నారన్నారు. పక్కా ఇళ్లు, మంచి నీటి కుళాయి, రహదారుల నిర్మాణం, నాణ్యమైన విద్య, విద్యుత్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నారన్నారు. ట్రైబల్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బేస్‌లైన్ సర్వేలను నిర్వహించడం ప్రారంభించిన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వాసంశెట్టి పెదబాబు, ఈఓపీఆర్డీ బి.మమత, ఉపాధి ఏపీఓ ఏవీ కృష్ణ, ఎంఈఓ–1 కాండ్రేగుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి వి.తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తుల వారిని ఆదుకోవాలి



తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మకు వినతిపత్రం ఇస్తున్న చేతి వృత్తుల సంఘం నాయకులు

అయినవిల్లి: చేతి వృత్తుల వారిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు కోనసీమ జిల్లా దుర్గా మల్లేశ్వరస్వామి కార్పెంటర్, చేతి వృత్తుల సంక్షేమ సేవా సంఘం నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కార్పెంటర్లు, చేతి వృత్తుల వారి సమస్యలను సంఘ సభ్యులతో కలసి తహసీల్దార్ లక్ష్మమ్మకు వివరించారు. రెడీమేడ్ ఫర్నిచర్, మొదలైన వస్తువుల తయారీతో తాము పూర్తిగా నష్టపోతున్నామన్నారు. కార్పెంటర్లు, చేతి వృత్తిదారులకు జీవనోపాధి లేక రోడ్డున పడుతున్నామన్నారు. వస్తులతో కాలం వెళ్లదీస్తున్నామన్నారు. తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో పితాని బి.రావు, గున్నేపల్లి భీమశంకరం, కొండపల్లి షణ్ముఖరావు, పూడి శివ గంగాధర్, కొపనాతి తాతాజీ తదితరులు ఉన్నారు.

నిండుశోకంతో ప్రవక్తలకు ఘన నివాళి



మామిడికుదురులో మర్షియా ఆలపిస్తూ గుమ్మటాల ఊరేగింపు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హసన్, మహ్మద్ ప్రవక్తల షహదత్‌ను మంగళవారం ముస్లింలు నిండుశోకంతో నిర్వహించారు. దీనిలో భాగంగా ఇమామ్ హసన్, మహ్మద్ ప్రవక్తల గుమ్మటాలను మామిడికుదురు, నగరం గ్రామ వీధుల్లో ఊరేగించారు. ముస్లింలు గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. సర్కిల్ పర్వత్ అలీబేగ్ ఆధ్వర్యంలో మర్షియా ఆలపించారు. నగరం బడేబీబీ పంజా వరకు ఈ గుమ్మటాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. బడే బీబీ పంజాలో షహదత్ మజ్లిస్ జరిగింది. మత ప్రబోధకులు మహ్మద్ తకీ మజ్లిస్‌లను ఆలపించారు. అనంతరం గుమ్మటాలను శాంతపర్చారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ముస్లింలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ప్రవక్తలకు శ్రద్ధాంజలి ఘటించారు.

మద్యం షాపుల సిబ్బంది నిరసన



రావులపాలెంలో నిరసన వ్యక్తం చేస్తున్న మద్యం షాపుల సిబ్బంది

రావులపాలెం: కూటమి ప్రభుత్వం మద్యం షాపుల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం షాపుల సిబ్బంది మంగళవారం రావులపాలెంలో నిరసన వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న తొమ్మిది మద్యం షాపుల సిబ్బంది స్థానిక సీఆర్‌సీ రోడ్డులో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 15 వేల కుటుంబాలకు చెందిన వారు ఉన్నారని వారికి భరోసా ప్రభుత్వం కల్పించాలన్నారు. నూతన మద్యం పాలసీని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే తమ ఉద్యోగాలపై ఎటువంటి స్పష్టత కల్పించలేదని కరోనా సమయంలో ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించమన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి విశేష కృషి

ఆలమూరు: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని బడుగువానిలంకలో సుమారు రూ.20 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ దశల వారీగా గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్‌ఈజీఎస్, ఆర్థిక సంఘ నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం సీసీ రోడ్లు శిలాఫలకాలను ఆవిష్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, ఎంపీటీసీ పడాల నాగలక్ష్మి, పాలూరి గోవిందు, దూలం రాంబాబు, ఎరుబండి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటమునిగిన పొలాల పరిశీలన



రామేశ్వరంలో డయాగ్నోస్టిక్ ఫీల్డ్ విజిట్ చేస్తున్న అధికారుల బృందం

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరం గుండమ్మ వంతెన వద్ద అధిక వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను సంబంధిత పలువురు అధికారులు బృందం మంగళవారం పరిశీలించారు. సకాలంలో వరి పంటను రక్షించుకునేందుకు తగు సూచనలు, సలహాలు రైతులకు వారు చేశారు. జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.జ్యోతిర్మయి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎ.రాజశేఖర్, జిల్లా వనరుల కేంద్రం ఏవో జె.మనోహర్, అమలాపురం ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ ఎం.నందకిషోర్, స్థానిక ఏవో పీవీ నరసింహారావు పొలాలను పరిశీలించారు. వారు వరి సాగు రైతులతో పొలాలు వద్ద ముమేకమయ్యారు. వరి పంట మూడు, నాలుగు రోజులు ముంపునకు గురైతే వీలైనంత త్వరగా పొలంలో నీటిని తీసివేసుకోవాలన్నారు. పంట త్వరగా కోలుకోవడానికి ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీలు పొటాష్ ఎరువులు అదనంగా వేసుకోవాలన్నారు. చేలల్లో నీరు పూర్తిగా తీసిన తరువాత తెగుళ్లు ఉధృతంగా పెరగకుండా కార్బన్‌డిజమ్, మాంకోజెబ్ మిశ్రమ శిలీంధ్ర నాశినిని పిచికారీ చేసుకోవాలన్నారు. వరి పంట సుమారు 40 రోజులుకు చేరుకున్న తరుణంలో పొడ తెగులు వృద్ధి చెంది, వ్యాప్తి చెందే అవకాశం ఉన్న దృష్ట్యా ఎకరానికి హెక్సాకొనజోల్ 400 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వీటితో పాటు ఆకుముడత నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీలీటర్లు మందు, ఎసిటేట్ 1.5 గ్రాము మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వీఏఏ డి.దుర్గా శ్రీనివాసరావు, వీహెచ్ఏ జె.మీనాక్షి, రైతులు నందం గోపాలకృష్ణ, జి.రాఘవులు, బి.నారాయణరావు, పి.సూర్య నారాయణరాజు, బి.రత్నరాజు, మోకా చిన్నయ్య, బి.రామరాజు పాల్గొన్నారు.

96 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



మామిడికుదురులో హాస్టల్ విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రశాంత్‌కుమార్

మామిడికుదురు: చేతులను పరిశుభ్రం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ కుమార్ సూచించారు. మామిడికుదురు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 96 మంది విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వైరల్ ఫీవర్లతో పాటు ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. సీహెచ్‌ఓ కెఎస్ సత్యవతి, ఎంపీహెచ్ఎస్ భూసారపు సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఏఎన్ఎంలు ఎం.జయకుమారి, కె.దుర్గాదేవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సేవా సంస్థ వార్షికోత్సవం



వృద్ధులకు నిత్యావసర కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు

రావులపాలెం: నేటి యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా నలుగురికి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ రెండో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక రెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ వేడుకలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంస్థ సభ్యులు ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకుల కిట్లను ఆయన చేతుల మీదుగా వృద్ధులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పెరాలసిస్ బాధితుడు పప్పు మదన్‌మోహన్‌కి వైద్యం నిమిత్తం రూ.10 వేల నగదు సాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. సత్యానందరావు మాట్లాడుతూ కొందరు యువతీయువకులు స్వచ్ఛందంగా సేవ చేయాలనే ఆలోచనతో సుమారు రెండు సంవత్సరాలు క్రితం శ్రీకాశీ అన్నపూర్ణదేవి స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న అనేక మందికి రూ.లక్షలు సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులను అభినందించారు. అనంతరం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సత్యానందరావును ఘనంగా సత్కరించారు. అలాగే సంస్థ సభ్యుల్లో ఉత్తమ సేవలు అందించిన 10 మందికి ఉత్తమ సేవా అవార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, అమలాపురం పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, చిన్న కేవీ, పడాల బుల్లి కొండారెడ్డి, సేవా సంస్థ ప్రెసిడెంట్ గొలుగూరి సత్యనారాయణరెడ్డి (సతీష్‌రెడ్డి), సెక్రటరీ మల్లిడి మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ సర్వీసు

- తండ్రి పేరుతో పేదలకు సేవలు
- ఇప్పటి వరకూ 2009 మందికి మేలు



ఉచిత అంబులెన్స్ వినియోగించుకుంటున్న ప్రజలు

మలికిపురం: కరోనా సమయంలో చాలామంది చాలా రకాలుగా ఇబ్బంది పడ్డారు. అందునా అంబులెన్స్ కోసమైతే వేలకు వేలు పోసి మరీ జనం నానాఅవస్థలు పడ్డారు. ఆ కష్టాలన్నీ చూసి అలాంటి కష్టాలు ఎవరికీ రాకూడదని తను చిన్న వ్యాపారంలో వచ్చిన దాంతోనే పేదలకు ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశాడు దెంతుకూరి రాంబాబురాజు. ఆయన స్వగ్రామం సఖినేటిపల్లి మండలంలోని గుడిమూల. ఆయనది సాధారణ మధ్య తరగతి కుటుంబం. అతడికి రెండేళ్ల వయసులోనే తన తండ్రిని సత్యనారాయణరాజును కోల్పోయాడు. మెల్లగా ఓ రొయ్యల మేత షాపు ప్రారంభించి అలా వచ్చిన ఆదాయంతో 2020 కరోనా సమయంలో తన తండ్రి పేరిట అంబులెన్స్ సర్వీసు ప్రారంభించాడు. అప్పట్లో రోజుకు ఐదు నుంచి ఆరుగురు రోగులకు సేవలు అందించారు. డ్రైవర్‌ను ఏర్పాటు చేసి ఎంత దూరమైనా ఇదే అంబులెన్సులోనే ఆసుపత్రులకు రోగులను తరలిస్తూ సేవలు అందించాడు. ఇలా చేయడం వల్ల సరాసరి నెలకు రూ.లక్షకు పైగా ఖర్చు అవుతోంది. ఇలా ఇప్పటికి ఐదేళ్లు అయింది. తన సేవలను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. సుమారు 2009 మంది వివిధ పేషెంట్లు ఈ అంబులెన్స్ ద్వారా సేవలు పొందారు.

బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు

దెంతుకూరి రాంబాబురాజు పేదలకు స్పోర్ట్స్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. శ్రీరామ్ బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో పేద విద్యార్థులకు, సీనియర్స్, జూనియర్స్, వెటరన్స్ విభాగాల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తున్నారు. ఇందుకు గాను ఆయన నెలకు రూ.40 వేలు ఖర్చు చేస్తున్నారు. గడచిన ఐదేళ్లలో దాదాపు 100 మందికి పైగా క్రీడాకారులు శిక్షణ పొందారు. వీరిలో 15 మంది రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించారు. 10 మంది జాతీయస్థాయిలో పతకాలు సాధించారు. మరో 20 మంది జిల్లా స్థాయిలో పతకాలు సాధించారు. మలికిపురానికి చెందిన యాండ్ర గౌతమ్‌కుమార్ ఈ అకాడమీ ద్వారా శిక్షణ పొంది అనేక పతకాలు సాధించాడు. అదే విధంగా మలికిపురానికి చెందిన వై.నందకిషోర్, ఉయ్యూరి వారి మెరకకు చెందిన గుబ్బల సింధు, మలికిపురానికి చెందిన డి.నిఖిల్ వర్మ పలు రాష్ట్ర, జాతీయ పోటీల్లో పతకాలు పొందారు.

సేవలు కొనసాగిస్తాను



నేను చేసేది చిన్న వ్యాపారమే అయినా వచ్చే ఆదాయంలో అధిక భాగం ఉచిత అంబులెన్స్, సేవలకే ఖర్చు చేస్తాను. ఈ సర్వీసును ఇలానే కొనసాగిస్తాను. అలాగే గ్రామీణ పేదల క్రీడాకారులను ప్రోత్సహించాలని బ్యాడ్మింటన్ అకాడమీ పెట్టాను. చాలా మంది శిక్షణ తీసుకుని రాణిస్తున్నారు.

– దెంతుకూరి రాంబాబు రాజు, మలికిపురం

కష్ట కాలంలో సేవలు పొందాం



మా మేనత్త యడ్ల జానకమ్మకు అత్యవసరంగా అమలాపురం ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. ఆమె నిరుపేద, ఆ సమయంలో ఉచిత అంబులెన్స్ గుర్తుకు వచ్చి వెంటనే ఫోన్ చేశాం. సమయానికి ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడింది. ఇటువంటి సేవలు అభినందనీయం.

– తాడి నీలకంఠం, అంతర్వేది

ప్రోత్సాహం అందించింది



శ్రీరాం బ్యాడ్మింటన్ అకాడమీ ఇచ్చిన ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో రాణించాను. 2023 అండర్–15 రాష్ట్ర స్థాయిలో సింగిల్స్, డబుల్స్, 2023 జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచాను. ప్రస్తుతం ఈ అకాడమీలోనే ఇంకా శిక్షణ పొందుతున్నాను. ఉన్నత స్థానాలకు వెళతాను.

– యాండ్ర గౌతమ్ కుమార్, క్రీడాకారుడు, మలికిపురం

ఉచిత హోమియో మొబైల్ వైద్య శిబిరం



అంతర్వేది గుడి వద్ద శిబిరం నిర్వహిస్తున్న హోమియో వైద్య బృందం

సఖినేటిపల్లి: టెలీకాలింగ్ ద్వారా నూతన ఒరవడి సృష్టిస్తోంది ఉచిత హోమియో మొబైల్ వైద్య శిబిరం. ఈ శిబిరం ద్వారా రోగులకు వైద్య సేవలు చేరువ చేస్తున్నారు పాలకొల్లు పట్టణానికి చెందిన ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణుడు డాక్టర్ కోసూరి రామకృష్ణానంద రాజు (డాక్టర్ పోదూరు రాజు). శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పిటల్ ఆధ్వర్యంలో రోజూ ఒక్కో గ్రామంలో ఉచిత హోమియో పిల్స్ వైద్య సేవలు ప్రజలకు అందజేయడం జరుగుతుంది. సోమవారం (సెప్టెంబర్ 2) అంతర్వేది గుడి వద్ద హోమియో పిల్స్ వైద్య బృందం ఈ కార్యక్రమం చేయడం జరిగింది. 22 మందికి ఉచితంగా డాక్టర్ టెలీ కాలింగ్ ద్వారా రోగుల వ్యాధులను తెలుసుకొని, దీర్ఘకాలిక వ్యాధులకు సైతం తగిన సలహాలు, సూచనలు ఇచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



కేశవదాసుపాలెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: మండలంలో భారీ వర్షాలకు ముంపుబారిన పడిన కేశవదాసుపాలెంలోని పలు ప్రాంతాలను మంగళవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలించారు. అగస్టీన్ కాలనీ, మెండుపాలెం రంగా సెంటర్, మారెమ్మ గుడి ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇళ్లను చుట్టుముట్టిన ముంపు నీటిని బయటకు పంపించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సరఫరా, ఇతర సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. నాయకులు గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, గుబ్బల ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అంబాజీపేటలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీను

అంబాజీపేట: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జనకళ్యాణ్ టీఐ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శ్రీను, పీహెచ్‌సీ వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్‌లు అన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అనుమతితో కోనసీమ జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శ్రీను మాట్లాడుతూ గ్రామాల్లో ఎయిడ్స్ వ్యాధి గ్రామస్తులను గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వం పంపిణీ చేసిన మందులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రత్నకుమారి, జనకల్యాణ్ స్టాఫ్ నర్స్ వి.జ్యోతి, రమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.